క్లుప్తంగా

పది పరీక్షలకు 40 మంది గైర్హాజరు

కిర్లంపూడి: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శ్రీకొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొలిరోజు ప్రశాంతంగా ముగిశాయి. శుక్రవారం జరిగిన పదో తరగతి పరీక్షలకు 93 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా, 53 మంది హాజరయ్యారు. మొత్తం 40 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు సీఎస్ బి.వరహాలబాబు తెలిపారు. కిర్లంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఇంటర్ ఫస్టియర్ సప్లిమెంటరీ పరీక్షలకు 155 మందికి 147 మంది హాజరయ్యారు. 8 మంది గైర్హాజరైనట్టు సీఎస్ వై.చనమాల తెలిపారు.

కార్మికుల తొలగింపు తగదు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఏలేశ్వరం: చిన్నింపేట గ్రామంలోని జీడిపిక్కల ఫ్యాక్టరీలో కార్మికుల తొలగింపును అడ్డుకోవాలని సీఐటీయూ నాయకులు అధికారులను కోరారు. సీఐటీయూ నాయకుడు రొంగల ఈశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ వై.రంగారావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ కొన్నేళ్లుగా పనిచేస్తున్న సుమారు 80 మంది కార్మికులను ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా తొలగించడం అన్యాయమన్నారు. జిల్లాలోని జీడిపిక్కల ఫ్యాక్టరీలు కార్మికులకు ఉపాధితో పాటు, ఉత్పత్తి పెంచి లాభాలు సాధిస్తుంటే, ఇక్కడి వారు కార్మికులను తొలగించడం దారుణమన్నారు. కార్మికుల తొలగింపుపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ ఫ్యాక్టరీ యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సాల్మన్ రాజు, కృష్ణమూర్తి, నాని, సురేష్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కొత్త పనులు ప్రతిపాదించండి

గండేపల్లి: ఉపాధి హామీ పథకంలో కూలీల కోసం కొత్త పనులకు ప్రతిపాదనలు ఇవ్వాలని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందికి ఆదేశించారు. మండలంలోని తాళ్లూరు, నీలాద్రిరావుపేట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించారు. కూలీల హాజరు నమోదు, మస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయం 5.30 గంటలకు పని చేసే చోట హాజరై, 10.30కు ముగించాలని, ప్రభుత్వం నిర్ణయించిన రూ.300 వేతనం పొందేలా పని చేసుకోవాలని కూలీలకు వివరించారు. వేసవి దృష్ట్యా తలకు రుమాలు చుట్టుకోవాలని, ప్రతి ఒక్కరూ రెండు లీటర్ల తాగు నీటిని వెంట తెచ్చుకోవాలన్నారు. ఈమె వెంట ఏపీఓ గంగాభవాని, టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రత్తిపాడు: రాజమహేంద్రవరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు పరిధిలో పారా లీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తులను స్వీకరించనున్నట్టు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్తిపాడు కోర్టు పరిధిలోకి వచ్చే ప్రత్తిపాడు, కిర్లంపూడి, ఏలేశ్వరం, శంఖవరం మండలాలకు చెందిన 18 ఏళ్లు నిండిన, పదో తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సేవా దృక్పథం కలిగిన అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి కలిగిన వారు తమ దరఖాస్తులను జూన్ 23లోపు మండల సేవాధికార సంస్థ, ప్రత్తిపాడు వారికి అందజేయాలని పేర్కొన్నారు.

మరిడమ్మ తల్లికి స్వర్ణ, రజత పుష్పార్చన



పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మానవతా దృక్పథం అవసరం

పెద్దాపురం: ప్రతీ విద్యార్థి మానవతా దృక్పథాన్ని అలవర్చుకోవాలని చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్ అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో వేసవి శిక్షణలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు జంతువులపై మనిషి వ్యవహరించాల్సిన విధానంపై జంతు ప్రేమికుడు నవీన్ నాని శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి అంశంలో విద్యార్థి దశ నుంచి అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు.

ఈదురు గాలులు.. కుండపోత

- చల్లబడిన వాతావరణం
- జోరు వానతో సేదతీరిన జనం
- పల్లపు ప్రాంతాలు జలమయం
- నేలకొరిగిన అరటి తోటలు

ఏలేశ్వరం: వివిధ ప్రాంతాల్లో కురిసిన ఆకస్మిక వర్షాలతో వాతావరణం చల్లబడింది. మరి కొద్ది రోజుల్లో రోహిణీ కార్తె సమీపిస్తున్నందున వేసవి ఉక్కపోత గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఈదురు గాలులతో కూడిన వర్షాలతో ప్రజలు కాస్తంత సేదతీరారు. కొన్నిచోట్ల ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం కురిసింది. అనేక గ్రామాల్లో రోడ్లు జలమయం కాగా, జన జీవనం స్తంభించింది. ఈ వర్షాలు పంటలకు మేలు చేకూర్చగలవని రైతులు పేర్కొన్నారు. అయితే కొన్నిచోట్ల ఈదురు గాలులకు అరటి తోటలు నేలకొరగ్గా, మామిడి తోటల్లో కోత కొచ్చిన కాయలు నేలరాలాయి.

ఏలేశ్వరంలో..

మండలవ్యాప్తంగా శుక్రవారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఎండలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు ఒక్కసారిగా కుండపోత వర్షం పడడంతో ఉపశమనం పొందారు. ఉదయం నుంచి ఎండలు తమ ప్రతాపం చూపగా, సాయంత్రం ఆకాశం మేఘావృతమై, ఈదురు గాలులు వీచాయి. సాయంత్రం వర్షం కురిసి వాతావరణం చల్లబడింది. దీంతో ప్రజలు సేదతీరారు. గత వారం రోజులుగా అడపాదడపా పడుతున్న వర్షాలతో రైతులకు మేలు కలుగుతోంది. ప్రస్తుతం రైతులు తమ పొలాల్లో పశువుల కోసం పచ్చిరొట్ట సాగు చేస్తున్నారు. రుతుపవనాలు ప్రవేశిస్తే జూన్ తొలి వారం నుంచి వరి సాగుకు సమాయత్తం అయ్యేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

భారీ వర్షంతో చల్లబడిన అన్నవరం

అన్నవరం: కొద్ది రోజులుగా భానుడి ప్రతాపానికి విలవిల్లాడిన సత్యదేవుని భక్తులు, అన్నవరం గ్రామస్తులు శుక్రవారం మధ్యాహ్నం మూడు నుంచి నాలుగు గంటల వరకు సుమారు గంట సేపు కురిసిన భారీ వర్షానికి సేద తీరారు. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల వరకు సుమారు 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. తర్వాత ఆకాశంలో దట్టమైన మబ్బులు కమ్ముకుని, వెనువెంటనే భారీ వర్షం కురిసింది. ఉరుములతో కూడిన వర్షం కుండపోతగా కురియడంతో రత్నగిరి మెట్ల దారి నుంచి వర్షం నీరు కిందకు ప్రవహించింది. తొలిపాంచా వద్ద స్వామివారి పాదాల మండపాన్ని ఆనుకుని వర్షపు నీరు రోడ్డు మీదకు చేరింది. కాగా, మెట్ల దారి వెంట రాకపోకలు సాగిస్తున్న భక్తులు ఈ వర్షానికి పూర్తిగా తడిచి ముద్దయ్యారు. రాత్రి వరకు వర్షం కురుస్తూనే ఉంది.

ఉరుములు, మెరుపులతో జోరువాన

గండేపల్లి: అప్పటివరకూ ఎండ తీవ్రతతో జనం తల్లడిల్లుతుండగా, ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కురిసిన జోరువానతో వాతావరణం చల్లబడింది. గత మూడు రోజుల నుంచి ఎండ వేడిమి తాళలేని ప్రజానీకానికి శుక్రవారం సాయంత్రం మూడు గంటలకు ప్రారంభమైన వర్షం సుమారు గంట పాటు ఏకధాటిన కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయం కావడంతో పాటు, రోడ్లపైన వర్షం నీరు పారింది. ఈదురు గాలులు వీయడంతో పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడగా, మరికొన్ని చోట్ల చెట్లు నేలకొరిగాయి. రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. గ్రామాలలో జన జీవనం స్తంభించింది. కాగా ఉరుములు, మెరుపులు రావడంతో కొన్ని ఇళ్లల్లో లైట్లు, ఫ్యాన్లు, ఇన్వర్టర్లు కాలి నష్టం వాటిల్లింది.



జి.కొత్తపల్లిలో నేలకొరిగిన అరటి తోట



తొండంగి మండలం దానవాయిపేట సముద్ర తీరం వద్ద ఎగసిపడుతున్న అలలు



సీతానగరంలో ఇంటిపై కొబ్బరి చెట్టు కూలడంతో తెగి పడిన విద్యుత్ తీగలు



తొండంగిలో కుండపోతతో మూతపడిన ఇటుకల బట్టీ



అన్నవరంలో రత్నగిరి వద్ద మేఘావృతమైన ఆకాశం

ముంచెత్తిన వర్షం

తొండంగి: మండలంలోని శుక్రవారం కుండపోత వర్షం కురిసింది. ఉదయం వేసవి ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ, మధ్యాహ్నానికి ఆకాశం మేఘావృతమైంది. అనంతరం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇటుకల బట్టీలు, తాండ్ర తయారీ కేంద్రాలు వర్షం దెబ్బకు మూతపడ్డాయి. బంగాళాఖాతం సముద్రం తీరంలో అలలు ఎగసిపడ్డాయి. తీరంలో నాటు పడవలపై వేటకు వెళ్లే మత్స్యకారులంతా అప్రమత్తంగా ఉండాలని తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు హెచ్చరించారు.

అరటి, మామిడికి నష్టం

శంఖవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈదురు గాలులకు అరటి తోటలు నేలకొరిగాయి. చేతికి వచ్చిన పంట నేలకొరగడంతో అరటి రైతులు కన్నీరు మున్నీరయ్యారు. పలుచోట్ల కోత దశలో మామిడి కాయలు నేలరాలాయి. ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలూ నేలకొరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పంటల నష్టాన్ని అధికారులు అంచనా వేసి, తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటికే ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో, అకాల వర్షంతో ప్రజలు సేదతీరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గంపేట: ఆకస్మికంగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం శుక్రవారం సాయంత్రం జగ్గంపేటను కుదిపేసింది. వాతావరణం చల్లబడడంతో ఎండ వేడిమితో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు కాస్తంత ఉపశమనం చెందారు. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండగా, సాయంత్రం జడి వాన కురిసింది. జగ్గంపేటలో పలు వీధులు జలమయమయ్యాయి. గ్రామ శివారు సీతానగరంలో ఓ ఇంటిపై కొబ్బరి చెట్టు కూలిపోయింది. దీంతో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విద్యుత్ సిబ్బంది అక్కడకు చేరుకుని, విద్యుత్ వైర్లను తప్పించి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది.

నెలాఖరుకు నాడు-నేడు పనుల పూర్తి

డీఈఓ రమేష్ వెల్లడి

తుని రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు-నేడు పనులు ఈ విద్యా సంవత్సరానికి సన్నద్ధంగా ఉండేలా ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించినట్టు జిల్లా విద్యా శాఖ అధికారి పి.రమేష్ వెల్లడించారు. శుక్రవారం తుని మండలం తాళ్లూరులో మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు అభివృద్ధి పనులను, పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షా కేంద్రాలను ఎంఈఓ పరవాడ గీతాదేవితో కలిసి పరిశీలించారు. అనంతరం తుని ఎంఆర్‌సీలో రికార్డులను, మండలానికి చేరిన పాఠ్య, రాత పుస్తకాలను ఆయన పరిశీలన చేశారు. తుని గరల్స్ హైస్కూల్లో నాడు-నేడు పనులు జరుగుతున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. పాఠశాలల వారీగా పనుల ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా బోధనకు అంతరాయం కలగకుండా నాడు-నేడు పనులు పూర్తి చేయాలని, బిల్లులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఎంఆర్‌సీలో రికార్డులను తనిఖీ చేశారు.



పాఠ్య, రాత పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈఓ రమేష్, ఎంఈఓ గీతాదేవి

కౌంటింగ్ కేంద్రాల వద్ద ఐడీ కార్డులు తప్పనిసరి

జగ్గంపేట: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు వచ్చే వారందరికీ ఐడీ కార్డులు తప్పనిసరిగా ఉండాలని జగ్గంపేట ఎన్నికల అధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఐడీ కార్డులను ఈ నెల 31 వరకూ జగ్గంపేటలో మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. జగ్గంపేట ఎన్నికల కార్యాలయంలో రాజకీయ పార్టీల నేతలకు శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్‌కు వచ్చే వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నియమ నిబంధనలను వివరించారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఉదయం ఏడు గంటల్లోపు హాజరు కావాలని తెలిపారు. జగ్గంపేట అసెంబ్లీ సెగ్మెంట్ కౌంటింగ్ కాకినాడ జేఎన్‌టీయూలోని అంబేడ్కర్ గ్రంథాలయం సెకండ్ ఫ్లోర్‌లో జరుగుతుందన్నారు. కౌంటింగ్ సిబ్బంది తప్పనిసరిగా ఫారం-18 కాపీలు తీసుకురావాలని చెప్పారు.



సిబ్బంది, నేతలకు నిబంధనలు వివరిస్తున్న ఆర్ఓ శ్రీనివాసరావు

బార్ అధ్యక్షునిగా అనిసింగరాజు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా అనిసింగరాజు కుక్కుటేశ్వరరావు ఎన్నికయ్యారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఈ నెల 4న జరిగిన బార్ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నికల్లో అనిసింగరాజు కుక్కుటేశ్వరరావు, రాజాల చిట్టిబాబుకు సమాన ఓట్లు రావడంతో, ఈ అంశాన్ని బార్ కౌన్సిల్ దృష్టికి తీసుకువెళ్లారు. ఒక్కొక్కరు ఆరు నెలల పాటు అధ్యక్షునిగా కొనసాగాలంటూ నిర్ణయం వెలువడింది. దీంతో సీనియర్ న్యాయవాదుల సమక్షంలో తొలి ఆరు నెలల పాటు అధ్యక్షునిగా అనిసింగరాజు కుక్కుటేశ్వరరావు, మిగిలిన ఆరు నెలలు రాజాల చిట్టిబాబు కొనసాగేందుకు వారు అంగీకరించారు. దీంతో శుక్రవారం ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ హాలులో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం జరిగింది. అధ్యక్షునిగా అనిసింగరాజు కుక్కుటేశ్వరరావు, ఉపాధ్యక్షునిగా రమణం వీరవెంకట్రావు, ప్రధాన కార్యదర్శిగా బొంగుశూరి మధుబాబు, సంయుక్త కార్యదర్శిగా పలివెల నాగేంద్రరాజు, కోశాధికారిగా జొన్నాడ రాజేష్, స్పోర్ట్స్, కల్చరల్ కార్యదర్శిగా లింగంపల్లి శివకుమార్, జ్యూనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యునిగా బత్తుల రవికుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కార్యవర్గాన్ని న్యాయవాదులు సత్కరించారు. కార్యక్రమంలో ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) రాష్ట్ర అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ బుగత శివ, మెంబర్ అవసరాల దేవి తదితరులు పాల్గొన్నారు.



బార్ నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న న్యాయవాదులు

ధ్రువపత్రాలు త్వరితంగా మంజూరు చేయాలి

తొండంగి: విద్యార్థులకు అవసరమైన వివిధ ధ్రువపత్రాలు త్వరితగతిన మంజూరు చేసేందుకు రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని తహసీల్దార్ జి.బాలకృష్ణారెడ్డి శుక్రవారం ఇక్కడ తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులు తమ ఉన్నత చదువులకు సంబంధించి కౌన్సెలింగ్‌లకు అవసరమైన ఈబీసీ, కుల, ఆదాయ తదితర ధ్రువపత్రాల కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో గ్రామ సచివాలయాల్లో వీఆర్వోలు వాటిని త్వరితగతిన పరిశీలించి, త్వరగా అప్‌లోడ్ చేయాలన్నారు. వాటిని త్వరితగతిన మంజూరు చేసి, సంబంధిత దరఖాస్తుదారుకు సమాచారం అందించాలన్నారు. ఈ మేరకు మండలంలోని అందరు వీఆర్వోలకు, గ్రామ సచివాలయ సిబ్బందికి ఆదేశాలిచ్చారు. నిర్లక్ష్యం వహించినట్టు ఫిర్యాదులు వస్తే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

మమత వ్యాఖ్యలపై నిరసన

తుని: మతపరమైన రిజర్వేషన్లపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ పార్కులో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి శుక్రవారం నివాళులర్పించారు.

సాగు మెళకువలతో మంచి దిగుబడులు

కోటనందూరు: సార్వా సాగులో మెళకువలు పాటించడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని పెద్దాపురం రైతు శిక్షణా కేంద్రం ఏడీఏ భ్రమరాంబ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఓ చంద్రశేఖర్ అధ్యక్షతన శుక్రవారం సార్వా సాగులో మెళకువలపై వీఏఏలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏడీఏ భ్రమరాంబ మాట్లాడుతూ సాగులో పూర్వ విధానాలు కాకుండా, అధునాతన విధానాలు అవలంబించేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. అన్ని రకాల యాజమాన్యాల నిర్వహణతో ఆరోగ్యవంతమైన అధిక దిగుబడులు సాధ్యమవుతాయన్నారు. రైతుకు ఖర్చు తగ్గించి, దిగుబడి పెంచడమే ఈ శిక్షణ ముఖ్యోద్దేశమన్నారు. విత్తనం ఎంపిక, విత్తనశుద్ధి, నారుమడి, ఎరువులు, నీటి యాజమాన్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కేవీ శివకుమారి, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ భ్రమరాంబ

స్ట్రాంగ్ రూములకు పటిష్ట భద్రత

- జాయింట్ కలెక్టర్, పిఠాపురం ఆర్ఓ ఎస్ రాంసుందర్‌రెడ్డి

పిఠాపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్ట్రాంగ్ రూములకు పటిష్ట భద్రత కల్పించినట్టు జాయింట్ కలెక్టర్, పిఠాపురం నియోజకవర్గ ఆర్ఓ ఎస్ రాంసుందర్‌రెడ్డి తెలిపారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్‌రూమును శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం కాకినాడ జేఎన్‌టీయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో భద్రపరచిన పిఠాపురం నియోజకవర్గ ఈవీఎంలనూ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్ రూములకు భద్రత పటిష్టంగా ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజూ, ఎప్పటికప్పుడు స్ట్రాంగ్‌రూముల వద్ద భద్రతను పరిశీలిస్తున్నామని చెప్పారు. నిఘా వ్యవస్థను అను నిత్యం పరిశీలిస్తూ, ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు. స్ట్రాంగ్‌రూములను పరిశీలించిన ఆయన భద్రతా సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ముగిసిన వెంకన్న కల్యాణోత్సవాలు

గోకవరం: తంటికొండ గ్రామంలో వెంకటగిరి కొండపై వేంచేసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో చివరి రోజు స్వామి వారికి ఊయలసేవ, శ్రీపుష్పయాగోత్సవం నిర్వహించారు. అంతకు ముందు విశేషార్చనలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈఓ గండి వెంకట లక్ష్మీకుమార్ మాట్లాడుతూ స్వామివారి కల్యాణోత్సవాలు భక్తులు, గ్రామస్తుల సహకారంతో ఘనంగా జరిగాయన్నారు.

పంట మార్పిడి.. లాభాల దిగుబడి

- లాభదాయకంగా కూరగాయల సాగు
- పత్తి, వరి కంటే ఎక్కువ ఆదాయం
- అందుబాటులో రైతు బజార్లు
- ఉద్యాన శాఖ ద్వారా ప్రోత్సాహకాలు

తుని: సంప్రదాయ పంటలను నమ్ముకున్న రైతులు మిశ్రమ పంటల వైపు దృష్టి సారించారు. ఒకే పంటను వేయడంతో ఆర్థికంగా నష్టాలను చవిచూస్తున్నారు. మారుతున్న ఆధునిక వ్యవసాయానికి అనుగుణంగా రైతులు పంట మార్పిడికి ప్రాధాన్యమిస్తున్నారు. మెట్ట ప్రాంతంలోని తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో వరి తర్వాత కూరగాయల సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా అందిస్తున్న ప్రోత్సాహకాలు, కూరగాయలకు డిమాండ్ ఉండడంతో ఎక్కువ మంది సాగుకు సన్నద్ధమయ్యారు. దీంతో ఈ సీజన్‌లో సన్నకారు రైతులు 887 ఎకరాల్లో కూరగాయల సాగుకు ప్రాధాన్యమిచ్చారు. తమకున్న భూమిలో ఒకే పంటకు బదులు ఎక్కువ రకాలను సాగు చేస్తున్నారు. దీంతో పాటు కొంత మంది రైతులు అంతర పంటగా కూరగాయలను సాగు చేసి మంచి దిగుబడులను సాధిస్తున్నారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న వివిధ రకాల కూరగాయలను అన్ని సీజన్లలోను పండించడం ద్వారా ఏడాది పొడవునా ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. బోరు బావులకు అవసరం మేరకు విద్యుత్ వినియోగించి దిగుబడులను సాధిస్తున్నారు. రైతులు రూ.లక్షల్లో ఆదాయం పొందుతున్నారు.



రౌతులపూడి మండలంలో సాగు చేస్తున్న తీగ జాతి పంట

మిశ్రమ పంటల సాగు

మెట్ట ప్రాంతమైన మూడు నియోజకవర్గాల్లో వర్షాధార భూములు ఎక్కువ. బోరు బావులున్న ప్రాంతాల్లో కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. గతంలో ఒకే పంటను వేయడం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోయేవారు. ఈ విధానానికి స్వస్తి పలికి, మిశ్రమ పంటల సాగు వైపు దృష్టి సారించారు. ఎకరా భూమిలో నాలుగు నుంచి ఆరు రకాల పంటలను వేస్తున్నారు. భూమిని చిన్న మడులుగా తయారు చేసి, వాటిలో వంగ, బెండ, బీర, కాకర, ఆనప, టమాటా, తోటకూర, పాలకూర, గోంగూర, మెంతికూర, మిరప, బొబ్బర తదితర రకాల పంటలను వేస్తున్నారు.

ప్రత్యేక జాగ్రత్తలు అవసరం

విత్తనాలు ఎంపిక నుంచి ఎరువులు, నీటి యాజమాన్యం వరకూ రైతులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పంట మార్పిడి విధానం పాటించడం వల్ల చీడపీడలు తగ్గడంతో పాటు, దిగుబడి కూడా ఆశాజనకంగా ఉంటుంది. ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టి, ఏడాదికి రూ, 90 వేల వరకూ ఆదాయం పొందుతున్నారు.

నియోజకవర్గం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
తుని	360
ప్రత్తిపాడు	270
జగ్గంపేట	157

అందుబాటులో రైతు బజార్లు

తుని మండలంలో చామవరం, వల్లూరు, కుమ్మరిలోవ, వి.కొత్తూరు, తాళ్లూరు, కొలిమేరు, రేఖవానిపాలెం, మరువాడ, నందివొంపు, దొండవాక, కేఓ మల్లవరం లోవకొత్తూరు, వల్లూరు తదితర గ్రామాల్లో పండించిన కూరగాయలను తుని మార్కెట్ యార్డుకు తెస్తున్నారు. రైతు బజారులో నేరుగా రైతులే అమ్ముకుంటున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఇక్కడ కొనుగోళ్లు చేసి ఎగుమతులు చేస్తున్నారు. జగ్గంపేట రైతులు రాజమహేంద్రవరం, ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని రౌతులపూడి, శంఖవరం మండలాలకు చెందిన రైతులు విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరం, విజయవాడ తదితర ప్రాంతాలకు ఎగుమతులు చేస్తున్నారు.

ఉద్యాన శాఖ రాయితీలు



కాయగూరల పంటలు సాగు చేసే రైతులకు ఉద్యాన శాఖ ద్వారా రాయితీపై విత్తనాలు అందిస్తున్నాం. బోరు బావి సదుపాయం ఉన్న రైతులకు డ్రిప్‌ను ఏర్పాటు చేసుకోవడానికి 90 శాతం మేర రాయితీని ప్రభుత్వం అందిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో కూరగాయల సాగు లాభదాయకం. మార్కెట్‌లో రాబోయే నెలల్లో మంచి డిమాండ్ ఉంటుంది. రైతులు ఉద్యాన శాఖ అధికారుల సూచనలు పాటించాలి.

– ఎం.విజయలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి, తుని

పంచాయతీలు విధిగా సెస్ చెల్లించాలి



కొత్తకొట్టాంలో నగదు పుస్తకాన్ని తనిఖీ చేస్తున్న ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్

కోటనందూరు: జిల్లా గ్రంథాలయ శాఖకు సెస్‌ను విధిగా చెల్లించాలని పంచాయతీ కార్యదర్శులను ఈఓపీఆర్డీ జి.అరుణ్‌కుమార్ ఆదేశించారు. అల్లిపూడి, కొత్తకొట్టాం, కేఏ మల్లవరం, పాతకొట్టాం పంచాయతీల్లో శుక్రవారం వార్షిక నగదు పుస్తకం లావాదేవీలను ఆయన తనిఖీ చేశారు. ఇంటిపన్ను డిమాండు, వసూళ్లపై పంచాయతీ కార్యదర్శిని ఆరా తీశారు. నగదు పుస్తకంలో వార్షిక జమా ఖర్చులను తనిఖీ చేసిన ఆయన జిల్లా గ్రంథాలయ శాఖకు ఎనిమిది శాతం సెస్‌ను తక్షణమే చెల్లించాలని ఆదేశించారు. ఇంటి పన్ను బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇలా ఉండగా మండలంలోని అల్లిపూడి, కొత్తకొట్టాం, పాతకొట్టాం, కేఏ మల్లవరం గ్రామాల్లో కొత్తగా అందుబాటులోకి వచ్చిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పంచాయతీ విస్తరణాధికారి అరుణ్‌కుమార్ సందర్శించారు. పిట్లలో వానపాములు వేసి కంపోస్టు ఎరువు తయారీకి తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.